క్లుప్తంగా

గంగానమ్మ జాతర ఉత్సవాలు ప్రారంభం



బంటుమిల్లి: స్థానిక రజక వీధిలోని గంగానమ్మ (నెల్లూలమ్మ) జాతర ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 4వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఉదయం అమ్మవారికి 108 కలశాలతో అభిషేకాలు జరిగాయి. ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు, గ్రామోత్సవం నిర్వహించారు. గరగల నృత్యాలు, కనకత ప్పెట్లు, కళాకారుల ప్రదర్శనలతో మొదటి రోజు ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఉత్సవాల సందర్భంగా రజకవీధిని విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు.

సర్పంచ్ శ్రీనివాసరావుకు ఎమ్మెల్యే పరామర్శ



ఉత్తరచిరువోలులంక(మోపిదేవి): ఉత్తర చిరువోలులంక సర్పంచ్ చింతా శ్రీనివాసరావును అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు బుధవారం పరామర్శించారు. ఇటీవల శ్రీనివాసరావు బైక్‌పై పడిపోవడంతో కాలువిరిగింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సింహాద్రి సర్పంచ్ ఇంటికి వెళ్లి ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అలాగే గత రెండు నెలలుగా అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చిన ఉప సర్పంచ్ తూము లక్ష్మీదేవి భర్త అంకినీడును ఎమ్మెల్యే సింహాద్రి పరామర్శించారు. కార్యక్రమంలో నాగాయితిప్ప సర్పంచ్ గరికిపాటి వెంకటేశ్వరరావు (బుల్లి), ఎంపీటీసీ సనకా వెంకట రాజేష్‌బాబు నాయకులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



గూడూరు: మల్లవోలులోని హైస్కూల్ ప్లస్‌లో ఇంటర్మీడియెట్ చదువుతున్న విద్యార్థినులకు పాఠ్యపుస్తకాలను బుధవారం పంపిణీ చేశారు. హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ జనరల్ సెక్రటరీ గోవాడ ప్రశాంతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాలలో చదువుతున్న బాలికలకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. మల్లవోలు శివాలయం ట్రస్ట్ బోర్డు చైర్మన్ గుండు సురేష్ దంపతుల సహకారంతో విద్యార్థులకు వీటిని అందజేశామని ప్రశాంతి తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని అరుణ, లైబ్రేరియన్ సురేష్, ఇంటర్మీడియట్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మూడు బుసక టిప్పర్లు పట్టివేత



పెడన: మండల పరిధిలో బుసకను తరలిస్తున్న మూడు టిప్పర్లను మైనింగ్ శాఖాధికారులు బుధవారం స్వాధీనం చేసుకుని పెడన పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అందిన సమాచారం మేరకు మైనింగ్ శాఖ ఏడీ కొండారెడ్డి తన సిబ్బందితో నందమూరులో అక్రమంగా బుసక తరలిస్తున్న టిప్పర్లపై దాడిచేశారు. మూడు టిప్పర్లను స్వాధీనం చేసుకుని పెడన పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. అనంతరం ఒక్కో టిప్పర్‌కు రూ.10 వేల వంతున జరిమానా విధించారు.

ఆనందోత్సాహాలతో రాఖీ పండుగ

మచిలీపట్నంటౌన్: రాఖీ పౌర్ణమి వేడుకలు బుధవారం నగరంలో ఆనందోత్సాహాలతో నిర్వహించారు. అన్నలకు, తమ్ముళ్లకు సోదరీమణులు రాఖీలు కట్టి సోదర ప్రేమను చాటుకున్నారు. రాఖీ కట్టి స్వీట్ తినిపించగా సోదరులు వారికి ప్రేమతో కానుకలు అందించారు. బ్రహ్మకుమారిలు అధికారులకు, నగర ప్రజలకు, ప్రముఖులకు రాఖీలు కట్టారు. పలు పాఠశాలల విద్యార్థినులు వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు)కు రాఖీలు కట్టారు.

రేపటి నుంచి వైద్య శిబిరం

మచిలీపట్నంటౌన్: బృందావనపుర ప్రార్థనా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి సెప్టెంబర్ 6వ తేదీ వరకు ఆజాద్‌రోడ్డులోని గీతా మందిరం భవనంలో ఆక్యుప్రెజర్ వైబ్రేషన్ సుజుకో, అయస్కాంత ఉచిత వైద్య శిబిరం జరుగుతుందని నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు ఆక్యుప్రెజర్ థెరపిస్ట్ వైద్యులు తన్‌రాజ్ చౌదరి, రేవంత్ చౌదరి వైద్య బృందం పర్యవేక్షణలో పలు వ్యాధులకు చికిత్స చేస్తారని చెప్పారు.

మూగ జీవాలకు మెరుగైన వైద్యం

- సంచార పశు అంబులెన్సుల ఏర్పాటు
- 1962కు కాల్ చేస్తే వెంటనే వచ్చి వైద్య సేవలు
- అవసరమైతే అదే వాహనంలో గన్నవరం ఆస్పత్రికి తరలింపు
- జగన్ ప్రభుత్వంపై పశుపోషకుల హర్షాతిరేకం



ప్రమాదంలో ఉన్న పశువును తరలించే ట్రైవీస్



ఇంటివద్దనే గేదెకు ఆపరేషన్ చేస్తున్న 1962 వాహనం డాక్టర్ యెహోషువా

మోపిదేవి: మానవులకే కాదు మూగజీవాలకూ మెరుగైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోంది. మూగజీవాలకు ప్రమాదకర సమయంలో వైద్య సేవలు అందించేందుకు డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ పేరుతో పశుసంవర్థక శాఖ ద్వారా ఎమర్జెన్సీ వెహికల్ (జీవీకే-ఈఎంఆర్ఐ) 1962ను ప్రవేశపెట్టారు. ఈ వాహనాలను నియోజకవర్గానికి రెండు కేటాయించారు. ఈ సేవలు ఎంతగానో ఉపయోగపడుతుండటంతో పశుపోషకులు హర్షాతిరేకాలు వ్యక్తంచేస్తున్నారు. నియోజకవర్గం పరిధిలో చల్లపల్లి, అవనిగడ్డ మండలాలకు రెండు జీవీకే వాహనాలు కేటాయించారు. ఎలాంటి ఫీజు లేకుండా 24 గంటలూ ఈ వాహనాలు అందుబాటులో ఉంటాయి. మండల కేంద్రంలో పనిచేస్తున్న వైద్యులు ఆస్పత్రిలో పనిచేస్తున్న సమయంలోనే మారుమూల ప్రాంతంలోని పశువులకు ఏదైనా ప్రమాదం జరిగి ఆస్పత్రికి రాలేని, నడవలేని పరిస్థితుల్లో 1962కు ఫోన్ చేస్తే వెంటనే ఆ వెహికల్‌లో ఉండే వైద్యులు, సిబ్బంది సకాలంలో ఘటనా స్థలానికి చేరుకుని వైద్యం అందిస్తారు. అవసరమైతే మండల పశువైద్యాధికారి సూచనలతో గన్నవరం ఆస్పత్రికి ఇదే వాహనంలో తరలిస్తారు. ఈ వాహనంలో తక్షణం అందించాల్సిన మెడిసిన్‌తో పాటు ట్రైవీస్ సదుపాయం కల్పించారు. ఈ ట్రైవీస్ నడవలేని పశువు వద్దకు చేరుకుని నెమ్మదిగా వాహనంలో ఎక్కించుకుని ఎలాంటి ఖర్చు లేకుండా అవసరమైన చోటుకు తరలిస్తారు. గతంలో లేవలేని గేదె, లేక ఎద్దును ఆస్పత్రికి తరలించాలంటే ఎంతో వ్యయ ప్రయాసలు కోర్చేవారు. ట్రైవీస్ వల్ల ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. లక్షలు పెట్టి కొనుగోలు చేసిన పశువును ప్రమాద సమయంలో పశువైద్యులు ఆదుకుంటూ మూగజీవాలకు ప్రాణాలు పోస్తున్నారు. ఈ వాహనంలోనే మందులను ఉచితంగా అందిస్తారు. గతంలో సకాలంలో వైద్యం అందక పశువులు మృతిచెందితే ఆ రైతు కుటుంబాలు రోడ్డున పడిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం సాయంతో ఈ పథకం అమలు చేస్తోంది. ఈ పథకం ఎంతో బాగుందని పశు పోషకులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

మూగ జీవాలకు ప్రాణం పోశారు



పాడి గేదెలపై ఆధారపడి జీవిస్తున్నా. నా రెండు సూడి గేదెలు కలుపు మందు చల్లిన గడ్డి తిని అపస్మారక స్థితిలోకి వెళ్లాయి. 1962కు కాల్ చేసిన వెంటనే జీవీకే వ్యాన్‌లో వైద్యులు వచ్చి సెలైన్ ఎక్కించి మందులు అందించి ప్రాణం పోశారు. ప్రస్తుతం ఆ రెండు గేదెలు ఈని రెండు దూడలకు జన్మనిచ్చాయి. వాటి వల్ల మా కుటుంబానికి జీవనాధారం ఏర్పడింది. జగనన్న ప్రభుత్వానికి ధన్యవాదాలు.

– యన్న శ్రీనివాసరావు, చిరువోలు

జగనన్నకు రుణపడి ఉంటాం



నా మైసూర్ ఎద్దుకు పుండు పడి ఎలర్జీ వచ్చింది. బండి కట్టందే మాకు జరగదు. ఎంతో భయాందోళన చెందా. 1962కు కాల్ చేశా. వెంటనే వైద్య బృందంతో కూడిన వాహనం వచ్చింది. సెలైన్ ఎక్కించి మందులు కూడా ఉచితంగా ఇచ్చారు. ప్రస్తుతం నా ఎద్దు బాగానే ఉంది. బండి కూడా కడుతున్నా. ఇంతగా ఉపయోగ పడుతున్న ప్రభుత్వాన్ని ఎన్నడూ చూడలేదు. జగనన్నకు ఎంతో రుణపడి ఉంటాం.

– పొలిమెట్ల రవి, కె. కొత్తపాలెం గూడెం

రైతులకు ఎంతో ఉపయోగం



ఈఎంఆర్ఐ వాహన సేవలు పశుపోషకులకు ఎంతో ఉపయోగం. గేదెలు, ఆవులు, ఎద్దులు, మేకలు, గొర్రెలు, కుక్కలు వంటి జీవాలకు వైద్యం అందిస్తున్నాం. అవసరమైన మేరకు అక్కడే ఆపరేషన్, ఫస్ట్ ఎయిడ్ అందించి మండల పశువైద్యులకు రిఫర్ చేస్తాం. మండల పశువైద్యుల సూచనల మేరకు గన్నవరం హాస్పటల్‌కు ఇదే వాహనంలో తరలించి ప్రాణాలు కాపాడుతాం.

– 1962 డాక్టర్ యెహోషువా, చల్లపల్లి

కాకినాడ-విజయవాడ బస్సు సర్వీసు ప్రారంభం

మచిలీపట్నంటౌన్: పలు జిల్లాల ప్రజల కోరిక మేరకు ఏపీఎస్ ఆర్టీసీ కాకినాడ డిపో నుంచి విజయవాడకు నూతనంగా ఏర్పాటు చేసిన అల్ట్రా డీలక్స్ బస్సు సర్వీసును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మచిలీపట్నం డిపో మేనేజర్ టి. పెద్దిరాజు కోరారు. ఈ బస్సు సర్వీస్ బుధవారం నుంచి ప్రారంభమైందన్నారు. కాకినాడ డిపో నుంచి యానాం, అమలాపురం, రాజోలు, నరసాపురం, బంటుమిల్లి, మచిలీపట్నం మీదుగా విజయవాడకు చేరుతుందన్నారు. ఉదయం 5 గంటలకు కాకినాడ నుంచి బయలుదేరి మధ్యాహ్నం 12 గంటలకు విజయవాడ చేరుతుందన్నారు. తిరిగి మధ్యాహ్నం 3.30 గంటలకు విజయవాడలో బయలుదేరి రాత్రి 10 గంటలకు కాకినాడ చేరుతుందని చెప్పారు. అలాగే గవర్నర్‌పేట డిపో నుంచి విజయవాడ-కాకినాడకు ఇదే రూట్‌లో మరో బస్సు సర్వీస్‌ను ఏర్పాటు చేశామన్నారు. విజయవాడలో ఉదయం 6.30 గంటలకు బయలుదేరి మచిలీపట్నం, బంటుమిల్లి, నరసాపురం, రాజోలు, అమలాపురం, యానాం మీదుగా కాకినాడ చేరుతుందన్నారు. మధ్యాహ్నం 1.55 గంటలకు కాకినాడ చేరుతుందన్నారు. కాకినాడ నుంచి 4.40 గంటలకు బయలుదేరి రాత్రి 12.15 గంటలకు విజయవాడ చేరుతుందన్నారు. ఈ సర్వీసుకు అడ్వాన్స్ టిక్కెట్ రిజర్వేషన్ సదుపాయం ఉందని చెప్పారు. మచిలీపట్నం నుంచి కాకినాడ వెళ్లే ప్రయాణికులు ఉదయం 8.15 గంటలకు, సాయంత్రం 5.15 గంటలకు ఈ బస్సు సర్వీసు అందుబాటులో ఉంటుందని వివరించారు.

రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు

మచిలీపట్నంటౌన్: రాబర్ట్‌సన్ పేటలోని రామలింగేశ్వరస్వామి దేవస్థాన ప్రాంగణంలో ఉపాలయంగా ఉన్న మంత్రాలయ రాఘవేంద్రస్వామి ఆలయంలో స్వామి వారి 352వ ఆరాధన మహోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యారు. సాయంత్రం గోపూజ, ధ్వజా రోహణ, ధ్యానపూజ వంటి పూజా కార్యక్రమాలు ఆలయ అర్చకస్వామి టి. విజయకుమార్ చార్ పర్యవేక్షణలో నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొ న్నారు. ఆలయ ఈఓ బి. సుబ్బారెడ్డి పర్యవేక్షించారు.

చెత్త తరలింపులో నిర్లక్ష్యం

- పేరుకుపోతున్న చెత్త నిల్వలు
- డంపింగ్ వాహనం, జేసీబీలకు చేయని మరమ్మతులు



డంపింగ్‌యార్డు వద్ద చల్లపల్లి రోడ్డుపై పేరుకుపోయిన చెత్త



మరమ్మతులకు నోచుకోని జేసీబీ

మచిలీపట్నంటౌన్: చెత్త తరలింపు వాహనం, జేసీబీ మరమ్మతులకు గురయ్యాయి. నెలల తరబడి వీటికి మరమ్మతులు చేయించకపోవడంతో నగరంలోని చెత్త చల్లపల్లి రోడ్డుపక్కన పేరుకుపోతోంది. ప్రతి రోజు నగరం నుంచి సుమారు 90 మెట్రిక్ టన్నుల చెత్త వస్తోంది. ఈ చెత్తను మూడు కాంట్రాక్టర్ వాహనాల ద్వారా గుంటూరులోని పవర్ ప్రాజెక్టుకు ఎప్పటికప్పుడు తరలిస్తుంటారు. కొద్ది నెలలుగా ఒక కాంట్రాక్టర్ వాహనం టైరు పగిలి మూలనపడింది. మిగిలిన రెండు కాంట్రాక్టర్ వాహనాల ద్వారానే గుంటూరుకు తరలిస్తున్నారు. కాంట్రాక్టర్ వాహనం మరమ్మతులకు గురికావడంతో చెత్త పూర్తిస్థాయిలో గుంటూరు పవర్ ప్రాజెక్టుకు తరలించడంలో ఇబ్బంది ఏర్పడుతోంది. చెత్తను తొలగించి డంపింగ్‌యార్డు పై వరకు ట్రక్కు ఆటోలు వెళ్లే మార్గం ఏర్పాటు చేసేందుకు ఉపయోగించే జేసీబీతోపాటు ఓ చిన్న జేసీబీ కూడా మరమ్మతులకు గురైంది. వీటి మరమ్మతులు పూర్తయితే గాని నగరంలోని చెత్తను ఎప్పటికప్పుడు గుంటూరుకు తరలించేందుకు వీలు కలుగుతుంది. దీనిపై ఏఈ వెంకటేశ్వరరావును 'సాక్షి' వివరణ కోరగా రానున్న రెండు రోజుల్లో మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకువస్తామన్నారు.

క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి

న్యాయమూర్తి రామకృష్ణయ్య



మాట్లాడుతున్న న్యాయమూర్తి రామకృష్ణయ్య

చిలకలపూడి(మచిలీపట్నం): విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య అన్నారు. స్థానిక డీఎంఎస్ ఎస్వీహెచ్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో డ్రగ్స్ వాడకం, మహిళలపై లైంగిక వేధింపులు, దాడులు, సైబర్ నేరాలు ఎక్కువవుతున్నాయని చెప్పారు. విద్యార్థులు వీటికి దూరంగా ఉండాలని, విద్యకు ప్రాధాన్యత ఇచ్చి మంచి భవిష్యత్‌ను ఎంచుకోవాలని చెప్పారు. న్యాయసేవాధికార సంస్థ ద్వారా చట్టాలపై అవగాహన కల్పించుకోవాలన్నారు. చట్టాలను తెలుసుకుని వాటికి అనుగుణంగా విద్యార్థులు ప్రవర్తించాలన్నారు. వాహనాలను వేగంగా నడపటం, రవాణా శాఖ నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించటం చట్టరీత్యా నేరమన్నారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీలి మునలయ్య మాట్లాడారు. ఎస్ఐ సత్యనారాయణరావు, ప్రభుత్వాస్పత్రి వైద్యులు ఎంవీడీ సుబ్రహ్మణ్యేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ డి. శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ బి. నాగజ్యోతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేత్రదానంతో అంధత్వాన్ని నివారించండి

జీజీహెచ్ సూపరింటెండెంట్ రమేష్‌కుమార్



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రమేష్‌కుమార్, వైద్యులు

మచిలీపట్నంటౌన్: ప్రతి ఒక్కరూ నేత్రదానం చేసి అంధత్వాన్ని నివారించాలని జిల్లా సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ రమేష్‌కుమార్ అన్నారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా జీజీహెచ్‌లోని సూపరింటెండెంట్ చాంబర్‌లో బుధవారం కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. నేత్రదానానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. ఈ నెల 25వ తేదీ నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు భారత ప్రభుత్వం నేత్రదాన పక్షోత్సవాలుగా నిర్ణయించిందని చెప్పారు. దీనిలో భాగంగా నేత్రదానంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. జిల్లా అంధత్వ నివారణాధికారి డాక్టర్ నాగజ్యోతి, జీజీహెచ్ నేత్ర విభాగాధిపతి డాక్టర్ జి. భానుమూర్తి, నేత్ర వైద్య విభాగం వైద్యులు శిరీష, పూజిత, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగుల ఉపాధి కల్పనకు కృషి

పేర్ని కిట్టు



కార్యక్రమంలో మాట్లాడుతున్న పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: రాష్ట్ర ప్రభుత్వం కల్పించే అవకాశాలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకుని జీవితంలో స్థిరపడాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు అన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం పోతేపల్లి పంచాయతీ పరిధిలోని మచిలీపట్నం ఇమిటేషన్ జ్యుయలరీ పార్కు మెంబర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హాల్‌లో మచిలీపట్నం స్కిల్ హబ్ సెంటర్, శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. కార్యక్రమాన్ని కిట్టు బుధవారం ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా నిరుద్యోగుల భవితకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందన్నారు. నిరుద్యోగుల్లో నైపుణ్యాన్ని పెంపొందించి ఉద్యోగ అవకాశాలు మరింత మెరుగుపరిచేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. అందుకోసం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర మంతటా ఇటువంటి స్కిల్ హబ్‌లు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ఈ హబ్‌ల ద్వారా అనేక రంగాలకు సంబంధించిన వివిధ కోర్సుల్లో శిక్షణ ఇచ్చి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నదే ముఖ్యమంత్రి లక్ష్యమని, ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎస్. శ్రీనివాసరావు, మచిలీపట్నం ఇమిటేషన్ జ్యుయలరీ పార్కు గౌరవ అధ్యక్షుడు చలమలశెట్టి నరసింహారావు, ఎండీ పి. సత్యనారాయణ, జ్యుయలరీ పార్కు అధ్యక్షుడు పి. వెంకటసుబ్బారావు, డీఐసీ జనరల్ మేనేజర్ రాపాక వెంకటరావు, స్కిల్ హబ్ కో–ఆర్డినేటర్ కె. దిలీప్ పాల్గొన్నారు.

పనిచేసే వారికే పట్టం కడదాం

- పార్టీలకు అతీతంగా పథకాల అమలు
- గడప గడపకు మన ప్రభుత్వంలో మంత్రి జోగి రమేష్



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న మంత్రి జోగి రమేష్

కృత్తివెన్ను: ప్రతి పేదవాని కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మనమంతా మంచి మనస్సుతో మరోసారి ఆశీర్వదించాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ అన్నారు. బుధవారం నిడమర్రు-1 సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సచివాలయం పరిధిలోని అడవిదొడ్లు, పోడు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ద్వారా చేకూరిన లబ్ధిని తెలియజేస్తూ ముద్రించిన బ్రోచర్లను అందజేశారు. స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను అక్కడికక్కడే అధికారులను పిలిచి పరిష్కరించారు.

అందరికీ మేలు చేస్తున్న జగనన్న..

కులమతాలు, పార్టీలకతీతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందరికీ పథకాలు అందజేస్తున్నారని మంత్రి జోగి రమేష్ తెలిపారు. ఇంత మంచి పాలన చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిలాంటి నాయకుడు మరొకరు లేరన్నారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా స్పందించే మంచి మనస్సున్న, అందరికీ మేలు చేసే మన జగనన్నను మనమంతా ఆశీర్వదించాలన్నారు. ఇప్పటి వరకు ఏ ముఖ్యమంత్రి కూడా ఇటువంటి సంక్షేమాన్ని అమలు చేయలేదని, ప్రతి నెలా ఒకటో తేదీ వేకువజామునే ఠంచనుగా పెన్షన్ ఇంటికి అందిస్తున్న మీ పెద్దకొడుకు జగనన్న అంటూ కొనియాడారు. అన్నివర్గాల ప్రజలు జగనన్నను ఆశీర్వదించాల్సిన అవసరం ఉందని చెప్పారు.

మంత్రికి రాఖీలు కట్టిన ఆశా వర్కర్లు..

మంత్రి జోగి రమేష్‌కు బుక్ కీపర్లు, ఆశావర్కర్లు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించారు. గడప గడపకు తిరుగుతున్న మంత్రికి ఓ చిన్నారి రాఖీ కట్టి స్వీటు తినిపించింది. అక్కచెల్లెమ్మలందరికీ మంత్రి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ గరుడప్రసాద్, జెడ్పీటీసీ రత్నకుమారి, ఏఎంసీ చైర్మన్ గంగాధర్, పార్టీ మండల కన్వీనర్ వెంకట్రాజు, కాపు, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ల డైరెక్టర్లు పి. మహేష్, జె. భూపతిరాజు, జేసీఎస్ మండల కన్వీనర్ కె. బాపూజీ, ఎంపీటీసీ టి. పెద్దింట్లమ్మ, తహసీల్దార్ రామకోటేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



గూడూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఆర్థికంగా ఎదగాలని స్టేట్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ ఫణిరామ్‌కుమార్ అన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మచిలీపట్నం రీజియన్ ఆధ్వర్యంలో గూడూరులోని వెలుగు కార్యాలయంలో బుధవారం సాయంత్రం రాత్రి శివర్ నిర్వహించారు. మండలంలోని వివిధ మహిళా స్వయం సహాయక సంఘాలు, వ్యవసాయ రుణాలకు సంబంధించి లబ్ధిదారులకు భారతీయ స్టేట్ బ్యాంక్ ద్వారా మంజూరైన రూ. 27.03 కోట్ల చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫణిరామ్ కుమార్ మాట్లాడుతూ జాతీయ బ్యాంకుల ద్వారా ప్రభుత్వం వివిధ రంగాల వారికి రుణాలు మంజూరు చేస్తోందన్నారు. రుణాలు పొందిన లబ్ధిదారులు ఆర్థిక ప్రగతి సాధించాలని చెప్పారు. గూడూరు బ్రాంచి మేనేజర్ వై.మాధవీలత, వెలుగు సీసీలు, బుక్ కీపర్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సీమంతం



కోనేరుసెంటర్: అటు అత్తింటి వారి ఆదరణ, ఇటు పుట్టింటి వారి ఆదరణకు నోచుకోని ఓ గర్భిణికి ఐసీడీఎస్ సిబ్బంది సీమంతం చేశారు. ఈ ఘటన బందరు మండలం జొన్నలవారిమోడి గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన గంథం రాధిక ఇటీవల ప్రేమ వివాహం చేసుకోగా రెండు వైపుల కుటుంబాలు వారి ప్రేమ వివాహాన్ని నిరాకరించాయి. దీంతో ప్రేమికులు వేరే కాపురం పెట్టారు. రాధిక గర్భం దాల్చింది. నెలలు నిండటంతో పుట్టింటి, అత్తింటి ఆదరణ లేని రాధిక పరిస్థితిని చూసిన ఐసీడీఎస్ సిబ్బంది స్పందించి పుట్టింటి బాధ్యతను తీసుకున్నారు. గ్రామంలోని పలువురు ముత్తయిదువలను పిలిచి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో రాధికకు బుధవారం సీమంతం చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎ. లక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయిని వాణి, మహిళా సంరక్షణ పోలీసు శిరీష, ఆశా వర్కర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కబడ్డీలో సత్తాచాటిన తలగడదీవి హైస్కూల్ బాలికలు



ప్రథమ స్థానంలో నిలిచిన తలగడదీవి బాలికల జట్టు

నాగాయలంక: కబడ్డీ పోటీల్లో తలగడదీవి బాలికల హైస్కూల్ జట్టు సత్తాచాటి విజేతగా నిలిచింది. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 26, 27, 28, 29 తేదీల్లో ఎనిమిది మండలాల స్థాయిలో అవనిగడ్డలో క్రీడా పోటీలు జరిగాయి. తలగడదీవి ఉన్నత పాఠశాల బాలికల జట్టు నాగాయలంక ఉన్నత పాఠశాల ప్లస్ బాలికల జట్టు ఫైనల్ పోటీలో తలపడ్డాయి. తలగడదీవి బాలికల జట్టు విజేతగా నిలిచింది. నాగాయలంక బాలికలు రన్నర్స్‌గా నిలిచారు. తలగడదీవి విద్యార్థిని ఎం.రోజా లాంగ్ జంప్‌లో, నాగాయలంక విద్యార్థి కె.హరీష్ 800 మీటర్ల రన్నింగ్‌లో ద్వితీయ స్థానంలో నిలిచారు.

విజేతలకు ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. విజేతలకు బుధవారం ఆయా పాఠశాలల్లో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు బండ్రెడ్డి శివరామ ప్రసాద్, వీఎస్వీ ప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్లు గాజుల లక్ష్మీప్రసాద్, కోసూరు పూర్ణచంద్రరావు, సీహెచ్‌వీ సుబ్బారావు, స్టాఫ్ సెక్రటరీ ఎం.సుబ్బారావు, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మచిలీపట్నం ఎలక్ట్రికల్ డివిజన్‌కు ప్రథమస్థానం



ఈఈ భాస్కరరావును సన్మానిస్తున్న ఉద్యోగ సంఘ నాయకులు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం ఎలక్ట్రికల్ డివిజన్‌కు మెరుగైన పనితీరుతో జిల్లాలో ప్రథమస్థానం లభించిందని మచిలీపట్నం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మన్నెం భాస్కరరావు బుధవారం తెలిపారు. మచిలీపట్నం డివిజన్ జిల్లా స్థాయిలో ప్రథమస్థానం సాధించడంపై పలువురు ఎలక్ట్రికల్ ఉద్యోగుల సంఘ నాయకులు, ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఈఈ భాస్కరరావును విద్యుత్ ఉద్యోగుల సంఘ నాయకులు బుధవారం ఘనంగా సత్కరించారు. ఉద్యోగ సంఘ నాయకులు మాట్లాడుతూ ఎంతో ఒత్తిడితో పనిచేసే విద్యుత్ కార్మికులకు ఈఈ భాస్కరరావు అండగా ఉంటూ డివిజన్‌ను జిల్లాలోనే ప్రథమస్థానంలో నిలిపారని అభినందించారు. కార్మికులకు, ఉద్యోగులకు ఏ సమస్య వచ్చినా ఆయన పరిష్కరిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకులు నాంచారయ్య, అంకబాబు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

8న అమ్మ వారికి గాజుల అలంకరణ

గుడివాడటౌన్: స్థానిక గౌరీ శంకర్‌పురంలో వేం చేసి ఉన్న శ్రీ గౌరీ శంకర్ స్వామి వారి దేవస్థానంలో శ్రావణ మాసం నాలుగో శుక్రవారం పురస్కరించుకొని సెప్టెంబర్ 8న అమ్మవారికి ప్రత్యేక గాజుల అలంకరణ నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ నటరాజన్ షణ్ముఖం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8న అమ్మ వారికి విశేష పూజలు నిర్వహిస్తామన్నారు.